కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. ప్రయాణీకులకు శాపం

దాసరిఅగ్రహారం వద్ద వంతెనను అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన దృశ్యం



➡ అసంపూర్తిగా జలదంకి-తెల్లపాడు రోడ్డు విస్తరణ పనులు

- గత ప్రభుత్వ హయాంలో రూ.20 కోట్లు మంజూరు
- టెండర్లను దక్కించుకున్న టీడీపీకి చెందిన కాంట్రాక్టర్
- నిధులు సరిపోలేదంటూ పనులు నిలిపివేత
- గత నవంబర్‌లో మరో రూ.4కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- అయినా పనులు చేపట్టకుండా కాలయాపన
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న 20 గ్రామాల ప్రజలు

జలదంకి: జలదంకి–తెల్లపాడు రోడ్డు విస్తరణ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం 20 గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. రోడ్డు పనులను పూర్తి చేయకుండా నిధులు సరిపోలేదని అర్ధాంతరంగా నిలిపివేయడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం 2021లో జలదంకి నుంచి కలిగిరి మండలం తెల్లపాడు వరకు ఉన్న సింగిల్ రోడ్డును జాతీయ రహదారి నంబర్ 325గా విస్తరించేందుకు రూ.20కోట్లను మంజూరు చేసింది. ఈ పనులను టీడీపీకి చెందిన కాంట్రాక్టర్ జీఎస్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ పేరుతో పనులను దక్కించుకున్నాడు. అప్పటి ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి పనులను ప్రారంభించగా రోడ్డు విస్తరణకు ఇరువైపులా తవ్వి కంకరపరిచారు. అనంతరం గట్టుపల్లి రోడ్డు, అన్నవరంరోడ్డు, దాసరిఅగ్రహారం, తిమ్మసముద్రం, తదితర గ్రామాల వద్ద బ్రిడ్జిలు, కల్వర్టుల నిర్మాణానికి రోడ్డును ధ్వంసం చేసి డైవర్షన్లు వేశారు. ఆ తరువాత నిధులు సరిపోలేదనే నెపంతో కాంట్రాక్టర్ పనులను అర్ధంతరంగా నిలిపివేశాడు. అప్పట్నుంచి ఆ మార్గంలో ప్రయాణించే 20 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది వర్షాకాలంలో కల్వర్టు, వంతెనల వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్లు మునిగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయి ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మరో రూ.4కోట్లు మంజూరు చేసినా..

గతేడాది నవంబరులో కూటమి ప్రభుత్వం రోడ్డు పనులకు అదనంగా మరో రూ. 4 కోట్లు నిధులను మంజూరు చేసింది. రోడ్డు పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించింది. అయినా పనులను ప్రారంభించకుండా వర్షాల సమయం అంటూ కాంట్రాక్టర్ దాటవేస్తూ వచ్చాడు. ప్రస్తుతం వర్షాలు ముగిసినా పనులను ప్రారంభించలేదు. బిల్లులు మంజూరు చేసినా పనులను కాంట్రాక్టర్ ప్రారంభించకపోవడం ఏమిటో అర్థం కావడం లేదు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని పనులు పూర్తి చేయించాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుకు ఇరువైపులా కంకరతోలి వదిలేసిన దృశ్యం



గతేడాది కల్వర్టు వద్ద డైవర్షన్‌పైకి చేరిన వర్షపు నీటిలో ద్విచక్రవాహనదారుల పాట్లు (ఫైల్)

కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం

జలదంకి-తెల్లపాడు రోడ్డు పనులను ప్రారంభించాలని జీఎస్సార్ ఇన్‌ఫ్రా సంస్థకు నోటీసులు ఇచ్చాం. గతేడాది నవంబర్‌లో ప్రభుత్వం రోడ్డు పనులకు మరో రూ.4కోట్లు నిధులను సైతం మంజూరు చేసింది. అప్పుడు వర్షాలు వస్తున్నాయని చెప్పి ప్రారంభించ లేదు. త్వరలో పనులను ప్రారంభించే చర్యలు తీసుకుంటాం.

– కే చక్రధర్‌రావు, డీఈ, ఆర్అండ్‌బీ, కావలి

క్లుప్తంగా

పొగాకు బ్యారెన్లు దగ్ధం

- రూ.6లక్షలకుపైగా ఆస్తి నష్టం



మర్రిపాడు: మండలంలోని చిలకపాడులో గురువారం రెండు పొగాకు బ్యారెన్లు దగ్ధమయ్యాయి. వివరాలు..గ్రామానికి చెందిన బీ రత్నారెడ్డి, బీ రామకృష్ణారెడ్డి పొగాకు బ్యారెన్లు పక్కపక్కనే ఉన్నాయి. రామకృష్ణారెడ్డికి చెందిన బ్యారెన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా గొట్టాలపై ఆకులు పడి మంటలు చెలరేగాయి. దాని పక్కనే ఉన్న బీ రత్నారెడ్డికి చెందిన బ్యారెన్‌కు సైతం మంటలు అంటుకున్నాయి. మర్రిపాడు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.6 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు వాపోయారు.

డీఎల్‌పీఓ తనిఖీలు

సంగం: స్థానిక గ్రామ సచివాలయాన్ని ఆత్మకూరు డీఎల్‌పీఓ నారాయణ గురువారం తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి పారిశుధ్య పనుల తీరును పంచాయతీ కార్యదర్శి నరసయ్యను అడిగి తెలుసుకున్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ వరప్రసాద్ ఉన్నారు.

ఆటోను ఢీకొన్న పాల ట్యాంకర్

- ఇద్దరికి గాయాలు



క్షతగాత్రుడ్ని ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్సై

మర్రిపాడు : స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయం సమీపంలో నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. వివరాలు.. వైఎస్సార్ జిల్లా బద్వేల్ నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న పాల ట్యాంకర్ అగ్నిమాపక శాఖ కార్యాలయం సమీపంలో అదుపుతప్పి పొగాకు కూలీలను తరలించేందుకు రోడ్డు పక్కన నిలిపి ఉన్న ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలోని ఇద్దరు గాయపడ్డారు. ఎస్సై శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ట్యాంకర్ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతోనే ప్రమాదం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీలకు అన్యాయం చేస్తే ఉద్యమిస్తాం

అల్లూరు: ఎస్సీ జాబితాలో ఇతరులను చేర్చి తమకు అన్యాయం చేయాలని చూస్తే ఉద్యమించేందుకు వెనుకాడబోమని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్రాధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజ్ అన్నారు. స్థానిక అంబేడ్కర్ యువజన సంఘ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అల్లూరు, విడవలూరు, బోగోలు మండలాల్లో దాదాపు 30 వేల మందికిపైగా ఉన్న శంభన్ అనే అయోధ్య కాపులను ఎస్సీ జాబితాలో చేర్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయన్నారు. వారిని వెంటనే ఎస్సీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు పొంగులూరి సుధాకర్, గంగపట్నం సతీష్, గొల్ల జాన్సన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయినికి డాక్టరేట్



ఆత్మకూరు: పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయినిగా పని చేస్తున్న వేలూరు భారతి డాక్టరేట్‌ను అందుకున్నారు. ఆమె యోగి వేమన విశ్వవిద్యాలయ తెలుగు విభాగం ఆచార్యులు టీ రామప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో 'ఒక శతాబ్దపు రాయలసీమ కథానిక' అనే అంశంపై పరిశోధనలు సాగించి పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. అందుకు గడనూ యోగి వేమన వర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా ఆమెను పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘ కార్యవర్గ సభ్యులు గంగాధర్, శివప్రసాద్, సుధాకర్‌రావు, పెంచలయ్య, సుబ్బారావు, తదితరులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అలాగే పాఠశాలలో హెచ్ఎం కోటేశ్వరమ్మ, సహచర ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన గీతాజ్ఞాన యజ్ఞ సమితి ఆధ్వర్యంలో పట్టణ, మండల స్థాయిలో నిర్వహించిన భగవద్గీత శ్లోక పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గురువారం బహుమతులను ప్రదానం చేశారు. పట్టణంలోని శ్రీనివాస ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతలుగా నిలిచిన మనస్విని, చరణ్‌కు బహుమతులను అందజేశారు. సోమవరపు యానాదిరెడ్డి, నాగరాజశర్మ, రామయ్య స్వామి, సామల సుబ్బరాయుడు, దోర్నాదుల సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పట్టాదారులపై చర్యలు చేపట్టాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న దేవిశెట్టిపల్లి వాసులు

సీతారామపురం: దేవిశెట్టిపల్లిలోని సర్వే నంబర్ 92 (1 నుంచి 6 వరకు)లోని 9.45 ఎకరాలు, సర్వే నంబర్ 86–1లోని 2.50 ఎకరాలకు సంబంధించి నకిలీ పట్టాలు పొందిన వారిపై రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని దేవిశెట్టిపల్లికి చెందిన పలువురు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేశ్వరి మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా గ్రామ రైతులు భూములను సాగు చేసుకుంటున్నారని, పట్టాదారు పాస్‌పుస్తకాలను సైతం పొంది ఉన్నారని తెలిపారు. మారంరెడ్డిపల్లి ఎస్సీ కాలనీవాసులు సదరు భూములకు నకిలీ పట్టాలు సృష్టించి అడ్డుతగలడం శోచనీయమన్నారు. ఈ విషయమై గతేడాది ఏప్రిల్ 2న ఆత్మకూరు ఆర్డీఓ స్పందించి నకిలీ పట్టాలు పొందిన వారిపై ఆర్వోఆర్ యాక్టు అసైన్‌మెంట్ రూల్స్ ప్రకారం చర్యలు చేపట్టాలని మండల రెవెన్యూ అధికారులను ఆదేశించించారని తెలిపారు. అయినప్పటికీ నేటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. సర్వే నంబరు 86–3లోని మాదిగ మాన్యాన్ని ఆక్రమించి మిగిలిన భూములకు అవకాశం లేకుండా చేస్తున్నా వ్యక్తిపైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ పీవీ కృష్ణారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగేంద్ర

వరికుంటపాడు: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గవదగట్ల వెంకటలక్ష్మమ్మ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర మాట్లాడుతూ మూడు నెలలకొకసారి జరిగే మండల సమావేశానికి రావాల్సిన అధికారులు గైర్హాజరవడం దారుణమన్నారు. ప్రజాసమస్యలను ఎవరికి విన్నవించాలని ప్రశ్నించారు. ఎంపీడీఓ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకుని మరోసారి పునరావృతం కాకుండా చూడాలన్నారు. మండలంలో 20 ఏళ్ల క్రితం మంజూరు చేసిన అసైన్‌మెంట్ భూములను రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు గతంలో ఫ్రీహోల్డ్‌లో ఉంచారని, ఇంకా భూములు ఉన్నాయని, వాటిని కూడా పరిశీలించి ఫ్రీహోల్డ్‌లో ఉంచేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైస్ఎంపీపీ దేవనబోయిన మధు, ఎంపీడీఓ వేణుగోపాల్‌రావు, తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఈఓపీఆర్డీ నాగూర్‌వలి, గండిపాళెం ప్రాజెక్ట్ చైర్మన్ అడుసుమల్లి వెంకటసుబ్బయ్య, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ ఆవుల అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి



కావలి: నివాళులర్పిస్తున్న దొడ్ల మనోహర్‌రెడ్డి



ఆత్మకూరులో నివాళులర్పిస్తున్న ఆపస్ నాయకులు

కావలి: మండలంలోని అడవిరాజుపాళెంలోని ఎంపీపీ పాఠశాలలో డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని గురువారం నిర్వహించారు. రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహరరెడ్డి ,డైరెక్టర్ కూనం తాతిరెడ్డి ,సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి పాల్గొని నేతాజీకి నివాళులర్పించారు. నేతాజీ హెచ్ఎం ఏ రఘునాథరెడ్డి, ఉపాధ్యాయులు అభిషేక్, రామారావు, మోహన్‌రావు, పద్మావతి, శైలజ, రమణయ్య, శ్రీలత పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని ఆపస్ డివిజన్ కార్యాలయంలో నేతాజీ చిత్రపటానికి అపస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆపస్ జిల్లా, డివిజన్ కార్యవర్గ సభ్యులు అనిల్‌కుమార్, రాఘవరెడ్డి, రమణారెడ్డి, పెంచలరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మాధవరెడ్డి, వెంకయ్య, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు సురేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం సాధ్యమని నమ్మి పోరాటం సాగించిన గొప్ప దేశభక్తుడు నేతాజీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేష్, రమణరాజు, మదీనా, సురేష్, పెద్దయ్య పాల్గొన్నారు.

ట్రంకురోడ్డును మాగుంట పార్వతమ్మ రోడ్డుగా మార్పు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి

కావలి: పట్టణంలోని ట్రంక్‌రోడ్డును మాగుంట పార్వతమ్మ రోడ్డుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి వెల్లడించారు. స్థానిక క్రీడా శాఖ మైదానంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు గురువారం ఆయన బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలి ఎమ్మెల్యేగా మాగుంట పార్వతమ్మ ట్రంక్‌రోడ్డును నాలుగు వరుసల రోడ్డుగా విస్తరించారని తెలిపారు. ఇటీవల పార్వతమ్మ కాలం చెందడంతో ఆమె జ్ఞాపకార్థంగా ట్రంక్‌రోడ్డుకు పేరు పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసి జీఓ విడుదల చేయించామని చెప్పారు. క్రీడా శాఖ మైదానంలో 30 అడుగుల వాకింగ్ ట్రాక్‌ను నిర్మించడంతో పాటు రాత్రి వేళల్లో కూడా వాకింగ్ చేసుకునేలా దీపాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. స్టేడియం నిర్మాణానికి రూ.2.60 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభించేలా కృషి చేస్తామన్నారు. ఈ నెల 28న కావలిలో కలెక్టర్ పర్యటిస్తారని, ఆయన దృష్టికి స్థానిక సమస్యలను తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

అల్లూరు: నగర పంచాయతీ పరిధిలోని అంజయ్య కాలనీకి చెందిన తుమ్మల రమణమ్మ(75) గురువారం మరణించగా అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు కేఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి ఆదేశాల మేరకు ఆ ఫౌండేషన్ సభ్యులు రూ.3 వేలు నగదును అందజేశారు. అలాగే ఫౌండేషన్‌కు చెందిన ఉచిత అంతిమ యాత్ర వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చేజర్ల: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేజర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్‌కే మెహతాబ్ సూచించారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి పండగ తరువాత మండలంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు. మలేరియా, టైఫాయిడ్, తదితర జ్వరాలు అధికంగా ఉన్నాయన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఆహారంలో చిరుధాన్యాలు, కాయకూరలు, ఆకు కూరలతో పాటు ప్రోటీనులు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమలతో విషజ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున దోమల నివారణకు చర్యలు చేపట్టడంతో అవి కుట్టకుండా దోమతెరలను వాడాలని సూచించారు.

ట్యాంకర్‌తో ఉచితంగా తాగునీటి సరఫరా

అల్లూరు: నగర పంచాయతీ పరిధిలోని క్రిస్టియన్‌పేట, ఇస్కపల్లిరోడ్డు, తదితర ప్రాంతాల్లో కేఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాంకర్‌తో ఉచితంగా తాగునీటిని గురువారం సరఫరా చేశారు. ఫౌండేషన్ చైర్మన్ కందల రాజారెడ్డి ఆదేశాల మేరకు తాగునీటి సమస్య ఉన్నత ప్రాంతాల్లో ఉచితంగా తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు ఫౌండేషన్ సభ్యులు కమల్‌సింగ్, జోసఫ్ తెలిపారు. మండలంలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే తమకు సమాచారం అందజేస్తే వెంటనే ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

చేజర్ల: మండలంలోని ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మురళి హెచ్చరించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పెళ్లేరు రెవెన్యూ పరిధిలోని పులసీళ్లపల్లి, పెళ్లేరు గ్రామాల్లో రీసర్వేను పక్కాగా చేపడుతున్నట్లు తెలిపారు. నెలాఖరులోగా రీసర్వేను పూర్తి చేస్తామన్నారు. రెండు గ్రామాల్లో దాదాపు 352 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూమి ఉందన్నారు. పెన్నా పోరంబోకు భూములను ఆక్రమించి పైర్లు సాగుచేయాలని చూస్తున్న వారికి నోటీసులు అందజేశామని తెలిపారు. ఎవరైనా పెన్నాపోరంబోకు భూములను ఆక్రమించి సాగుచేయాలని చూస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెన్షనర్లకు లైఫ్‌సర్టిఫికెట్లు

కావలి: పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో పెన్షనర్లకు లైఫ్‌సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు కావలి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల రమణయ్య శుక్రవారం తెలిపారు. లైఫ్‌సర్టిఫికెట్ల కోసం వచ్చే పెన్షనర్లు ఆధార్ కార్డు, ఫోన్‌ను తప్పక తీసుకురావాలని సూచించారు. ఫింగర్‌ప్రింట్ డివైస్ పని చేయకపోయినా ఫోన్ ద్వారా ఫేస్ ఆర్డీ యాప్‌ను ఉపయోగించి లైఫ్‌సర్టిఫికెట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఆదివారం కూడా లైఫ్‌సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. పెన్షనర్లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో లైఫ్ సర్టిఫికెట్లు పొందాలని కోరారు.

వక్ఫ్ ఆస్తులను ఆక్రమిస్తే చర్యలు



చదును చేసిన భూమిని పరిశీలిస్తున్న వక్ఫ్ అధికారులు

ఆత్మకూరు: వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన ఆస్తులను ఎవరైనా ఆక్రమిస్తే చర్యలు తప్పవని వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే ఖుదావన్ హెచ్చరించారు. పట్టణంలోని ఎల్ఆర్‌పల్లిలో పోలీసు స్టేషన్ వెనుక భాగంలో ఉన్న వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన భూమిని కొందరు చదును చేసినట్లుగా తెలుసుకున్న ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు ఆధీనంలో ఉన్న సుల్తాన్ షాహీద్ దర్గాకు సంబంధించి సర్వే నంబరు 852లో 2.35 ఎకరాల భూమిని కొందరు చదును చేసి విక్రయించేందుకు యత్నిస్తున్నట్లుగా సమాచారం అందడంతో పరిశీలించినట్లు తెలిపారు. ఆక్రమణకు యత్నించిన వారికి నోటీసులు అందజేయడంతో పాటు కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఉలవదిబ్బలో సర్వే నంబరు 844లో ఉన్న 3.70 ఎకరాల భూమిని పలువురు ఆక్రమించి గదులు నిర్మిస్తున్నట్లుగా తెలిసిందని, వారిపైన కేసులు నమోదు చేయనున్నట్లు తెలిపారు. దర్గా ఆస్తుల కేర్‌టేకర్ ఎస్‌కే దస్తగిరి, ముతీవర్ షేక్ సలాం, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్న దృశ్యం

అల్లూరు: విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు విద్యుత్ అదాలత్ చైర్మన్, విశ్రాంత జడ్జి వీ శ్రీనివాస ఆంజనేయ మూర్తి పేర్కొన్నారు. అల్లూరులోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను గురువారం నిర్వహించారు. విద్యుత్ అదాలత్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తితో పాటు ఆర్థిక సభ్యులు కేవీ రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీకుమార్ పాల్గొని విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదాలత్ చైర్మన్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ షేక్ మస్తాన్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను మోతాదు మేరకే వాడాలి

ఆత్మకూరురూరల్: వరి పంట సాగు చేస్తున్న రైతులు ఎరువులను మోతాదు మేరకే వాడాలని ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ సూచించారు. వాశిలిలో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గంధకం కలిగిన 20:20:013 ఎరువును అధికంగా వినియోగిస్తే నేల చౌడు బారడంతో పాటు వేరుకుళ్లు, సల్ఫర్ లోపం వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. నత్రజని ఎరువులను విచక్షణా రహితంగా వినియోగిస్తే పంట దిగుబడులపై దుష్ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. ఏఓ కిషోర్‌బాబు మాట్లాడుతూ వరికి యూరియాకు బదులుగా నానో యూరియాను ఎకరాకు 500 మి.లీ.ను పిచికారీ చేస్తే సరిపోతుందని తెలిపారు.

చేజర్ల: మండలంలోని మడపల్లిలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏఓ శైలజాకుమారి పాల్గొన్నారు. రైతులకు ఎరువులు, పురుగు మందుల యాజమాన్యంపై శిక్షణ ఇచ్చారు. పొదలకూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త సురేఖాదేవి, ఏఓ శశిధర్ పాల్గొన్నారు.

మర్రిపాడు: మండలంలోని కంపసముద్రంలో సాగుచేసిన జొన్న పంటను ఆత్మ పీడీ జీ శివన్నారాయణ, నెల్లూరు కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి, ఏఓ ఎస్ రామ్మోహన్ పరిశీలించారు. కత్తెర పురుగు ఉన్నట్లు గుర్తించి నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్‌ను ఎకరాకు 100 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. పురుగు ఉధృతి మరింత ఎక్కువగా ఉంటే నోవాల్యురాన్ 5.25 శాతం, ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.9 శాతం ఎస్‌సీ అనే మందులను ఎకరాకు 350 మి.లీను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి



ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందజేయాలని మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్ సూచించారు. గురువారం ఆయన శానిటరి ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్‌తో కలిసి మున్సిపల్ కార్యాలయయంలో హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చికెన్, మటన్ స్టాళ్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. నిల్వ ఉంచిన చికెన్, మటన్, చేపలను వినియోగించి తయారు చేసే ఆహార పదార్థాలు తిన్న వారికి ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. తాజా ఆహార పదార్థాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. హోటళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వాడకాన్ని నిలిపివేయాలని ఆదేశించారు. మున్సిపల్ నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోకావారిపాళెంలో వైద్యశిబిరం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీ పరిధిలోని కోకావారిపాళెంలో జ్వర పీడితులు ఎక్కువగా ఉండడంతో పాటు అనుమానిత డెంగీ కేసు నమోదు కావడంతో చాకలికొండ పీహెచ్‌సీ వైద్యాధికారి మురళీధర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరపీడితులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి లార్వా, జ్వరపీడితుల సర్వే చేపట్టారు. నాలుగు రోజుల పాటు గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించి జ్వరాలను అదుపులోకి తెస్తామని వైద్యాధికారి తెలిపారు. ఉదయగిరి సబ్ యూనిట్ అధికారి షేక్ నౌషాద్, ఆరోగ్య బోధకుడు వెంకటేశ్వర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.